# రాళ్ళు

చలికి ఆగలేక మట్టయ్య రోలును కౌగలించుకున్నాడు. అతని భార్య సుక్కాం సన్నికల్లును కౌగలించుకుంది.

చలికాగలేకపోతే చిక్కటి దుప్పట్లు కప్పుకుంటారు. వెచ్చటి రగ్గుల్లో దూరుతారు. చలినెగళ్ళు చుట్టూ మూగుతారు. వంట్లో వేడి పుట్టించే "హాట్ డ్రింక్స్" త్రాగుతారు. పడకటిళ్ళల్లో మొగుడూ పెళ్ళావూ గట్టిగా వాటేసుకుని వెచ్చగా సుఖంగా పడుకుంటారు. అంతేకాని, ఇదేంటి ఇలా రోళ్ళనూ, రోకళ్ళనూ కౌగిలించుకోవటం? వీళ్ళిద్దరూ పిచ్చివాళ్ళయి వుంటారని మీరు భావిస్తున్నారు కదూ!

అలాంటిదేం కాదు; వాళ్ళు పిచ్చివాళ్ళు కారు!

అయితే రోలునూ, సన్నికలునూ కౌగిలించుకునే బదులు, వాళ్ళిద్దరూ భార్యా భర్తలేగా, వాళ్ళే కౌగిలించుకోవచ్చును కదా అని కూడా మీరడగవచ్చును!

నిజమే, వాళ్ళిద్దరూ యింట్లో గనుక పడుకున్నట్లయితే అలాగే చేసి వుండేవాళ్లేమో!

కాని, వాళ్ళు యింట్లో పడుకోలేదు; నడివీధిలో పడుకున్నారు. వాళ్ళు మంచి రద్దీ సెంటర్లో వున్న బ్యాంకు చప్టాల మీద పడుకుని వున్నారు.

అప్పుడు రాత్రి తొమ్మిదిన్నర గంటలయి వుంటుంది. మొదటాట సిన్మాలు వదిలిపెట్టారు. సిన్మాలకెళ్ళిన జనం సిన్మాలోని సంగతులు చెప్పుకుంటూ పోతున్నారు. చుట్టూతా అద్దాలు దింపుకొని లోపల వెచ్చగా, సుఖంగా కూర్చుని కారుల్లో కొందరు పోతున్నారు. రిక్షాల్లో, ఆటోల్లో కావాలని ఇరుక్కుని కూర్చుని కొందరు, స్కూటర్ల మీద ఠీవిగా కూర్చుని మరికొందరూ పోతున్నారు. మఫ్లర్లు చెవుల చుట్టూ చుట్టుకొని, వూలు స్వెట్టర్లు, వున్ని కోట్లూ, కాశ్మీర్ శాలువాలూ ధరించి వెచ్చవెచ్చగా సుఖంగా కొందరు పోతున్నారు.

దుమ్ముకొట్టుకుపోయిన బ్యాంకు చప్టాల మీద పడుకున్న మట్టయ్య, అలాటి సమయంలోనే చలికాగలేక తన తలక్రింద పెట్టుకున్న చిన్న రోలును ప్రక్కకు జరుపుకుని దాన్ని కౌగలించుకున్నాడన్నమాట! చలికి అది మంచుగడ్డ లాగా వుంది. అందుకని, తన తలగుడ్డను దానికి తలగుడ్డగా చుట్టి దాన్ని ఆప్యాయంగా వాటేసుకుని పడుకున్నాడు. అతని కాళ్ళ కింద పెట్టుకున్న సన్నికలును అతని పెళ్ళాం తీసుకొని కన్నబిడ్డకు కప్పినట్లు తన పమిట చెంగు కప్పి గుండెల్లో పొదువుకొని పండుకున్నది.

ఆ బ్యాంకు కెదరుగా రోడ్డు కటువయిపుగా సిటీ బస్‌స్టాప్ ప్రక్కన ఒక పెద్ద ఖాళీ స్థలం వుంది.

అది ప్రైవేటు ఖాళీస్థలం. దాని ఆసామి అందులో వరుసగా డాబా కొట్లు కట్టించాలని, వాట్ని అద్దెలకిచ్చి, ఆ అద్దె డబ్బులు కూడపెట్టి మేడ కట్టుకోవాలని కలలు కంటున్నాడు. పాపమతని దురదృష్టమేమిటో గాని గత పన్నెండేళ్ళుగా అతడలా కలలు కంటూనే వున్నాడు. కొట్టు మాత్రం కట్టించలేకపోయాడు. జనం మాత్రం ఈలోపల దాన్ని 'పబ్లిక్ యూరినల్స్'గా వాడేస్తున్నారు.

ఆ పగలంతా మట్టయ్య ఆ ఖాళీ స్థలంలో ఎండలో కూర్చుని ఆ రోలునూ, సన్నికలునూ చెక్కాడు. సుక్కాం, ఆ స్థలంలోనే ఒక వయిపుగా గోడవారగా మూడు రాళ్ళు పెట్టి వంట మొదలుపెట్టింది. వంటంటే ఏముంది, మట్టికుండలో అన్నమూ, దాకలో పచ్చిపులుసూనూ్నా, మధ్యమధ్యలో తనూ రుబ్బు పొత్రాలు చెక్కుతూ భర్తకు సాయపడింది.

సాయంకాలం చల్లపడే వేళకు ఒక చిన్నరోలూ, సన్నికలూ తయారయ్యాయి. చూడచక్కగా, కుదమట్టసంగా వున్నాయి. వాట్ని చూసుకుని మట్టయ్య తృప్తిగా నవ్వుకున్నాడు.

తుండుగుడ్డను తలమీద చుట్టకుదురుగా చుట్టి రోలును తలమీద కెత్తుకొని, సన్నికలును దండచేతిమీద పెట్టుకుని యిళ్ళ వెంట తిర్గి అమ్ముకుని రావటానికి అప్పటికప్పుడే బయలుదేరాడు. చీకటి పడేవారకు యిళ్ళ వెంట తిరిగి, తిరిగి, కష్టానికి గిట్టుబాటయిన బేరం కుదరనందున వాట్ని మళ్ళీ తిరిగి తీసుకొచ్చేశాడు.

అమ్ముడుపోని ఆ రోలును, సన్నికలునూ ఆ రాత్రికి పక్కలో పెట్టుకుని బ్యాంకి చప్టాలమీద పడుకున్నారు.

.... అలా వాళ్ళు వొళ్ళు మరచి గురక పెట్టుతూ నిద్రబోతున్న సమయంలో ఆ బ్యాంక్ నైట్ వాచ్‌మన్ నర్సింగులు వచ్చాడు. పెద్ద మిలిటరీ ఆఫీసరులాగా చేతిలోని చిన్న లాఠీ కర్రను విలాసంగా వూపుకుంటూ ఠీవిగా వచ్చాడు. చప్టాలు మీద మునగదీసుకుని పడుకున్న వీళ్ళను చూశాడు. అతనికి కస్సున కోపం వచ్చింది. తనక్రింద పన్జేసే చిన్న వుద్యోగస్తుల మీద చిర్రుబుర్రులాడే పెద్ద ఆఫీసరులాగా పోజు పెట్టాడు. లాఠీని నేలమీద తాటిస్తూ 'ఎవర్రా ఇక్కడ పడుకుంది?'' అని అన్నాడు చాలా దర్జాగా, మరంత జబర్దస్తీగా.

వళ్ళు మరచి నిద్రపోతున్న మట్టయ్య కంగారుపడుతూ లేచి కూర్చున్నాడు.

కళ్ళు నులుముకుంటూ ఎదురుగుండా యమధర్మరాజులాగా నిలబడ్డ నర్సింగుల్ను చూశాడు.

"దండాలు దొరా! నాను. మట్టాయి గాడ్ని -" అని అన్నాడు ముందే పరిచయమున్న వాడిలాగా.

లంచం ఆశ చూపెట్టితే ఆఫీసరెలా చల్లబడిపోతాడో, అలా చల్లబడిపోయాడు నర్సింగులు; అతడి కోపం నీళ్ళు చిలకరించినట్లు చప్పబడిపోయింది.

"నీవట్రా మట్టాయి! అదెవరు, సుక్కాంవా? ఎప్పుడొచ్చారు?'' సొంత యింటికి వచ్చిన చుట్టాల్ని పరామర్శించినంత అభిమానంగా అన్నాడు.

"పొద్దుటేలా వచ్చాం దొరా!''

నర్సింగులు, "ఏంటి మళ్ళీ రాళ్ళేసుకొచ్చావా, మీ వూళ్ళో వర్సాలున్నాయా?'' అంటూ మట్టయ్యతో కబుర్లు మొదలుపెట్టాడు.

"వర్షాల్లేవు; పాడులేవు దొరా! పల్లెలో సేత్తానికి కూలిపన్లు దొరకటం లేదు. అందుకని మళ్ళీ రాళ్ళేసుకొచ్చా."

మట్టయ్య సొంత వూరిలో ముమ్మరంగా పొలం పనులు సాగే రోజుల్లో ఎక్కువ కూలి గిట్టుతుందని కూలి పనులకు పోతాడు. మిగతా రోజుల్లో ఇలా రోళ్ళూ సన్నికల్లూ మొదలయినవి చెక్కి ప్రక్కనున్న పట్టణంలో అమ్ముతుంటాడు.

మట్టయ్య ఉండే పల్లె చుట్టూతా కొండలున్నాయి. ఆ కొండరాళ్ళు, రోళ్ళూ తిరగళ్ళు చెక్కడానికి బాగా పనికి వస్తాయి. పల్లెలో సరుకు (రోళ్ళు, తిరగళ్ళు, సన్నికల్లూ మొదలైనవి) తయారుచేసి, వాటన్నిటినీ ఒకేసారి బస్తీకి తీసుకొచ్చి అమ్మటం చాలా యాతన. అందువల్ల ఇలా అడపా దడపా బస్తీకొచ్చి పది పదిహేను రోజులపాటు మకాం పెట్టుతాడు. ఇక్కడిక్కడ రాళ్ళు చెక్కి, ఏరోజు సరుకారోజు ఇళ్ళ వెంట తిర్గి అమ్ముకుంటాడు. తనకు వుడకేసి పెట్టడానికి పనికి సాయంగా ఉంటుందని పెళ్ళాన్ని కూడా వెంటబెట్టుకుని వస్తాడు. బస్తీ కొచ్చే ఖాళీ లారీ వాళ్ళను బ్రతిమాలుకొనో, రెండో మూడో చేతిలో పెట్టో సరిపడినన్ని ముడిరాళ్ళను వెంట తెచ్చుకుంటాడు. అలాటి రాళ్ళు బస్తీలో గానీ, ప్రక్క ప్రాంతాల్లో గాని దొరకవు. ఈ రాళ్ళకు అతని పల్లె ప్రసిద్ధిచెందినది.

ఇలా వచ్చినప్పుడల్లా ముడిరాళ్ళు పెట్టుకోవటానికి, కూర్చుని రాళ్ళు చెక్కుకుని, యింత వుడకేసుకుని తింటానికి బ్యాంకు కెదురుగా వున్న ఈ ఖాళీ స్థలం అనువుగా వుపయోగపడుతుంది; రాత్రుళ్ళు పడుకోడానికి బ్యాంకి చప్టాలున్నాయి.

నర్సింగులు బీడీ ముట్టించి, "అయితే మళ్ళీ ఈసారి పది పదిహేను రోజులు మకాం వేస్తారన్నమాట!" అని అన్నాడు.

పైకి యథాలాపంగా అన్నా, లోపల అతనికి చాల ఆనందంగా వుంది. ఎందుకంటే వాళ్ళను అక్కడ పడుకోనిచ్చినందులకు మట్టయ్య దగ్గర్నుంచిరోజూ రాత్రిపూట "టీ డబ్బులు" వసూలు చేస్తాడు. ఆ డబ్బుల్తో వేడివేడిగా "వుల్పా చాయి" త్రాగి, బీడీలు కాలుస్తూ, నిద్దట్లో చీర తొలగి బయటికి నగ్నంగా కనిపించే సుక్కాం రొమ్ముల్నీ, బలంగా వుండే నల్లటి తొడల్నీ వూరికే చూస్తూ వుషారుగా డ్యూటీ చెయ్యటం అతనికెంతో ఆనందదాయకమైన విషయం!

"ఈపాలి వూరికి బేగెల్లిపోవాలి దొరా! అందుకే రాళ్ళు కూడా కొద్దిగా ఏసుకొచ్చా -"

నీరసంగా, "ఎందుకురా?" అన్నాడు. 'వుల్పాచాయి' ఎక్కువ రోజులు దొరుకుతుందనుకున్న నర్సింగులు నిరుత్సాహపడిపోయాడు.

మట్టయ్య, "బుడ్డోడికి" జ్వరం తగిలింది. వారం రోజులుగా లంఖణాలు చేస్తున్నాడు. వాడ్ని యింటి వద్ద తన ముసలి తల్లి దగ్గర వదిలేసి వచ్చాడు. జ్వరం వస్తోన్న పిల్లాడ్ని, కళ్ళు సరిగ్గా కనిపించని ముసలి తల్లి దగ్గర వదిలేసి, అందులోనూ దీపావళి పండుగ ముందు ఇలా బస్తీకి రాళ్ళేసుకు రావాల్సిన పని కాదు; కాని తప్పనిసరయి వచ్చాడు.

మట్టయ్య ఈ విషయాలన్నీ చెప్పుతుంటే మధ్యలో సుక్కాం లేచి కూర్చుంది.

"మూసినకన్ను తెరవకుండా పడున్న బిడ్డడ్ని వదిలేసి వచ్చేవాళ్ళమే కదన్నియ్యా! ఆ దొంగసచ్చినోడు సావుకారాయన బాకీ కోసరం వచ్చాం." అని మెటికలు పటపట విరిచింది. "ఆడి జిమ్మడ, బాకీ డబ్బు ఇరవయ్ రూపాయలు కట్తావా, యింటి ముంగల కట్టేసిన మేకను తోలుకుపోనా అని కూకున్నాడు. ఆ సచ్చినాడి బాకీ తీర్సటానికిట్టా వచ్చాం అనియా!" అని అంది.

మట్టయ్యదగ్గర పొగాకు కాడ తీసుకొని తాపీగా చుట్ట చుట్టుకుంటూ, "అప్పెందుకు సేశావురా!' ' అని అడిగాడు నర్సింగులు.

"అప్పు సేయక ఎట్టా దొరా! కూలిపన్లు లేకపాయే! తిండి గింజలెట్టా? కోంటాయన కాడ అప్పు సేయక? దీనికి తోడు, పిల్లగాడికి జొర. మా ఆడదానికి జొరం - ఆ సావుకారాయన కాళ్ళా ఏళ్ళా పడితే దీపాలమాస పండుగకి బాకీ కట్టానికి గడువు పెట్టిండు. ఎట్టగో ఆడి బాకీ డబ్బుల మటుకయినా చంపాదించి పట్టుకెళ్ళి ఆడి మొకాన కొట్టాలా - నేకపోతే, మేకను తోలుకుపోతాడు" అని మట్టయ్య చాల బాధగా దిగాలుగా అన్నాడు.

నర్సింగులు ఈ విషయాలన్నీ చాల నిర్లిప్తంగా, ఏదో కాలక్షేపానికి విన్నట్లుగా విన్నాడు. అతనికివి వుబుసుపోక వినే సంగతులయితే వీళ్ళకు గొంతుకమీద కొచ్చిన విషమ సమస్యలు!

..... నర్సింగులు ఇలాకాసేపు మట్టయ్య కష్టమూ - సుఖమూ అడిగి తెల్సుకొని మెల్లగా సకిలించి జేబులు తడుముకుంటూ, "మట్టయ్యా! నేనట్టా ఎల్లి కాత్త "సేయ్" కొట్టొత్తా!" అనీ అన్నాడు.

అతని వుద్దేశం గ్రహించి మట్టయ్య బొడ్లోంచి చిన్న మురికి సంచిని తీసి, అందులోంచి బహుభద్రంగా పదిహేను పైసలు బయటికి తీసి యిచ్చాడు.

నర్సింగులు టీ త్రాగి వచ్చేసరికి మట్టయ్యా, అతని పెళ్ళామూ మళ్లీ గురకలు పెట్టుతూ నిద్రపోతున్నారు.

* * *

తెలతెలవారుతూ వుంది. ఆకాశం పిసినిగొట్టుగా వెలుగుల్ని కాస్త కాస్తే జారవిడుస్తూంది. నర్సింగులు బ్యాంకు బయటికటకటాల తలుపులు మూసి తాళం వేసి యింటికి పోయే సన్నాహంలో వున్నాడు. అప్పుడే సిటీ బస్సులు హడావుడిగా పోతున్నాయి.

సుక్కాం మొగుణ్ణి లేవకొట్టింది. మట్టయ్య బద్దకంగా లేచి కూర్చున్నాడు. కళ్ళు నులుముకుంటూ, ఎదురుగా (ఖాళీ స్థలంలో) రాత్రికి రాత్రి వెలసిన దీపావళి టపాకాయ కొట్లను ఆశ్చర్యంగా చూశాడు.

"రాత్రి రెండోఆట సిన్మా వదిలేక వీళ్ళు రిచ్చాల మీద సామాను తెచ్చి కొట్లు తెర్సారురా మట్టయ్యా!" అంటూ యింటికి దారి పట్టేడు నర్సింగులు.

సుక్కాం గంతా బొంతా తీసుకొని వెళ్ళింది. మట్టయ్య చుట్ట త్రాగుతూ కూర్చున్నాడు. దీపావళి కొట్ల వాళ్లు సామాను సర్దుకుంటున్నారు. వాళ్ళకు లైసెన్సు దొరకటం ఆలస్యమయింది. అందువల్ల పండుగ ఇంకా మూడురోజులుందనగా కొట్లు తెరిచారు.

ఇంతలో సుక్కాం రోడ్డు కవతల వయిపు పేవ్‌మెంట్ మీదనిలబడి, కంగారు, "మాఁవో, బేగిరా,

బేగిరా'' అంటూ చేయి వూపి కేకేసింది.

"ఏంటే నీయమ్మా. పొద్దుటే ఏటయిందే?'' అని రోలునూ, సన్నికలునూ గోడ ప్రక్కకు జరిపి పెట్టి, పంచె పైకెగకట్టుకుంటూ వెళ్ళాడు.

"మన రాళ్ళు కానరాటం లేదు మాఁవా!'' అంది బిక్కమొగం వేసుకుని, అమాయకంగా.

"రాళ్ళేడికి పోతాయే ఎర్రిమొగమా?'' అంటూ పెళ్ళాన్ని "వెర్రిమొగాన్ని'' చూచినట్లు చూచి, దీపావళి కొట్లు వెనక్కివెళ్ళి చూశాడు.

తను నిన్న వేసిన చోట నిజంగానే రాళ్ళు కనిపించకపోయే సరికి అతడే వెర్రిమొగం వేశాడు.

రాళ్ళు ఏమయిపోయినాయా అనుకుంటూ కంగారుగా అటుప్రక్కా, ఇటు ప్రక్కా చూశాడు. ఎక్కడా లేవు. రెండు చిన్న సైజు రాళ్ళు మాత్రం వున్నాయి. అవి రుబ్బుడు పాత్రాలు చెయ్యటానికి పనికొస్తాయి.

రాళ్ళు పోయినాయని నిర్ధారణగా తెలియగానే అతని గుండెల్లో రాళ్ళు పడ్డాయి. దడ పుట్టుకొచ్చింది. కాళ్ళు వణికాయి. కాలు కాలిన పిల్లిలాగా, తప్పిపోయిన పెంపుడు కోళ్ళనో, ఆవుదూడలనో వెతుకుతున్నట్లు, మారుపడ్డ చిన్నపిల్లలకోసం గాలిస్తున్నట్లు అతడు ఆ రాళ్ళకోసం అటు తిరిగాడు, ఇటు తిరిగాడు. గోడ మూల చిన్న అడవిలాగా పెరిగిన పిచ్చిమొక్కల్ని ఒక్కొక్కదాన్నే చేత్తో తప్పించి చూస్తూ తచ్చట్లాడుతూ వెతుకుతున్నాడు.

యింతలో సుక్కాం, దీపం స్తంభం దగ్గర నిలబడి "మాఁవో, ఈడ్రా, ఈడ్రా!'' అంటూ చేయి వూపి పిల్చింది.

"ఏంటే, నీయమ్మా! రాళ్ళు పోయి గంగెర్లు ఎత్తి నేను ఎనుకులాడుతుంటే, ఊకే ఈడ్రా ఈడ్రా అని పిలుత్తావ్?'' అని విసుక్కుంటూ వచ్చాడు.

గొంతు తగ్గించి మెల్లగా, "మన రాళ్ళాడవున్నాయి సూడు!'' అని అటువయిపు చూపించింది.

ఆ టపాకాయ కొట్లల్లో ఒక కొట్టు ఆసామి, మట్టయ్య రాళ్ళను చక్కగా అటూ ఇటూ పేర్చి వాటిమీద అడ్డంగా చెక్కలు పెట్టాడు. ఆ చెక్కల మీద టపాకాయ సామాన్లు సర్దుతున్నాడు.

ఆ దృశ్యాన్ని చూసి మట్టయ్య బెల్లం కొట్టిన రాయిలాగ నోరెళ్ళపెట్టి నిశ్చేష్టుడయి చూస్తూ వుండిపోయాడు. ఏం చెయ్యటానికీ, ఏం అంటానికీ పాలుపోక అలా బొమ్మలాగా, పాతేసిన దీపంసెమ్మె లాగా నిలబడిపోయాడు.

సుక్కాం మొగుడ్ని చేత్తో తట్టి, "అట్టా వూరికే సూత్తావేంటి? ఆళ్ళనడుగూ -'' అని అంది.

భార్య హెచ్చరికతో మట్టయ్య ఎలాగో తేరుకున్నాడు. మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ ఆ కొట్టు దగ్గరికెళ్ళాడు. తడారిపోతున్న గొంతుకతో భయం భయంగా, "ఆ రాళ్ళూ, ఆ రాళ్ళూ-'' అంటూ నీళ్ళు నములుతూ నసిగాడు.

ఆ కొట్టులో నలుగురైదుగురు మనుషులు చాల బిజీగా పనిచేస్తోన్నారు - పెద్ద పెద్ద అట్టపెట్టెల్లోంచి టపాకాయల పెట్టెలు తీసి ఒకరు బయటపెట్టుతూంటె యిద్దరు వాట్ని అరల్లోకి సర్దుతున్నారు. ఒకరు

రంగు కాగితాలంటిస్తున్నారు. ఒకరు మైక్ పెట్టే ఏర్పాట్లో వున్నారు.

చాల సేపటి వరకు ఎవరూ తలెత్తి మట్టయ్య వంక చూడలేదు; అతని మాట వినలేదు. తర్వాత కాసేపటికి, "కిరీటం జుట్టుతో గారపళ్ళతో, మెళ్ళో బంగారపు గొలుసుతో, చేతి వ్రేళ్ళకు తెల్లరాళ్ళ వుంగరాలతో గీరగా వున్నవాడు వోరగా మట్టయ్య వంక చూశాడు. మట్టయ్య ఆకారం అంచనాకు చిక్కగానే తన చూపును చిరాకుగా మార్చాడు.

మట్టయ్య మళ్ళీ 'నా రాళ్ళూ, నా రాళ్ళూ!'' అన్నాడు.

"గీరబాబు'' గారపళ్ళతో కరిచేటట్లుగా, "ఏంటి?'' అని కసురుతూ అడిగాడు.

"నా రాళ్ళు మీరెట్టుకున్నారు''

"ఏవి. ఇవా? నీ రాళ్ళా? అసలు నీకు రాళ్ళెక్కడివి? వాటిమీద నీ రాళ్ళని పేరేశావా?'' అన్నాడు కోపంగా. "అనవసరంగా నన్ను డిస్టర్బ్ చెయ్యకు!'' అన్నట్లు మొగంపెట్టి.

'గీరబాబు' మాటలకు మిగతావాళ్ళు చేస్తున్న పనులాపి, తలలెత్తి చూశారు.

ఒకడన్నాడు- "ఈ స్థలం వోనర్ శాస్తుర్లు గారి రాళ్ళు ఇవి!''

నేలద్దె తీసికుంటంలా -ఆయన మమ్మల్ని కావాలంటే వాడుకోమన్నాడు. మాకవసరం వచ్చాయి. వాడుకున్నాం.''

రోళ్ళు చెక్కుకోవటానికి ఈ రాళ్ళను తన పల్లెనుండి తెచ్చుకున్నానని మట్టయ్య చెప్పుకున్నాడు.

"అవన్నీ మాకు తెల్దు పోవయ్యా! వూరికే పొద్దున్నే వచ్చి నస పెట్టుతున్నావు. మా పని చెరుపు. కావాలంటే వెళ్ళి ఆయన్ని అడుక్కో పో - అనవసరంగా వాగవాకు, పో-'' అని గీరబాబు వూరికే గింజుకుంటూ అతన్ని కసిరి కొట్టేడు.

మట్టయ్య కింకేం అనాలో తోచలేదు. ఆ కొట్లో వాళ్ళు అలా తలా ఒకమాట అని కసురుకునేపరికి హడలిపోయాడు. కిక్కురుమనకుండా పిల్లిలాగా వచ్చి, బస్‌స్టాప్ ప్రక్కన వీధి స్తంభాన్ని ఆనుకుని దిగాలుపడి కూర్చుండిపోయాడు.

ఈ అన్యాయాన్ని గురించి ఎవరికి చెప్పుకోవాలి? ఈ మహాపట్టణంలో తన మొర ఎవరింటారు? గట్టిగా మాట్లాడితే మొదటికే మోసానికి వచ్చేటట్లుంది - అసలు ఇవి నీ రాళ్ళు అని ఎక్కడుంది? సర్కారువాళ్ళు రాళ్ళను నీ రాళ్ళంటున్నాననే నెపాన్ని నెత్తిన వేసేయగలరు. అంత దిట్టలు ఈ సిటీవాళ్ళు.

సుక్కాం వచ్చి మొగుడి ప్రక్కన కూర్చుంది. మెటికలు విరుస్తూ ఆ కొట్ల వాళ్ళను కటికట తిట్లు (ప్రక్కన వున్న మొగుడికి మాత్రమే వినిపించేటట్లు) తిట్టింది.

అసలు రాళ్ళేలేకపోతే రోళ్ళేం చెక్కుతాడు. ఏం అమ్ముతాడు. యింటికి డబ్బేం తీసుకెళ్లతడు. షావుకారు బాకీ ఎలా తీరుస్తాడు? - మట్టయ్య నీళ్ళు కారిపోయాడు. షావుకారు బాకీ గుర్తుకు రాగానే అతని గుండెలు నీరసంగా కొట్టుకున్నాయి.

తనెంతే ప్రేమగా, కడుపున పుట్టిన బిడ్డలాగ ఇన్నాళ్ళుగా సాకుతున్న మేక కళ్ళల్లో కనిపించింది.......

"ఎండ ఎక్కి పోతుంది. కూడు వండుదామంటే బియ్యం గింజలు కూడా లేవు." అంది మెల్లగా.

"ఏందే నీ యమ్మా! వొప్పుడు సూడు. కూడు కూడని ఏడుత్తావ్?" అని పెళ్ళాం మీద చిరాకుపడ్డాడు. తన కోపమంతా ఎదురుగావున్న పెళ్ళాం మీద చూపించాడు. "బీదోడు" అంతకంటె ఇంకేం చేస్తాడు?

"ఆ(.... నా పొట్ట పగలగొట్టుకుందామనీ!" అంది నిష్ఠూరంగా.

"రాళ్ళు పోయి నేనేడుత్తుంటే మద్దెలో కూడ కూడంటావేందే?"

"నామీద పడిపోతావేంది? మరి రాత్తిరి అట్టా బండమొద్దునాగా నిద్దరపోకపోతే ఆ రాళ్లకు కాపలా కూకోపోయావా?"

"ఈ నాయాళ్ల యిట్టా సేత్తారని నాకేం తెల్సు?" అన్నాడు దిగులుగా. అతని కేడ్పు వొక్కటే తక్కువ.

మొగుడి దిగాలు మొగం చూస్తుంటే సుక్కాంకు కడుపు తరుక్కుపోతోంది; ఎంతో జాలేసింది. కళ్ళు చెమ్మగిల్లాయి కూడా.

"వూకే అట్టా నెత్తిన సెయ్యేట్టుకొని కూకోపోతే ఆ సేత్తుర్లుగోరికాడకు పోరాదు? ఇట్టగయిందని సెప్పితే మరాయనగోరన్నా ఈళ్ళకు సెప్పి యిప్పిత్తాడేమో!" అని సలహా యిచ్చింది.

పెళ్ళాం చెప్పిన సలహా మట్టయ్యకు నచ్చింది.

"మరాయనగోరి యిల్లు నాకు తెలవదుగందే?" బుర్ర గోక్కుంటూ అన్నాడు.

"నీ వెక్కడ మడిసివంటా? ఒకసారి ఆయనగోరు రోలు నీసేత పట్టించుకుపోయిండు కందా, డబ్బులు కూడా ఇవ్వకుండా-"

ఒకసారి ఆ స్థలం ఆసామి శాస్తుర్లు వచ్చి, "ఈ స్థలం ఎవరిదనుకుంటున్నావ్? నీ బాబు సొత్తులాగా, యిక్కడ ఏకంగ, కాపురం కూడ పెట్టి రాళ్ల చెక్కుతున్నావని" మట్టయ్యను హడలకొట్టాడు. మట్టయ్య కాళ్ళా వేళ్ళా పడేసరికి ఆయన శాంతించి, "మా ఆవిడ ఒక రోలు కావాలంటుందని ఒక రోలు "వుల్ఫా"గా యింటికి పట్టించుకుపోయాడు. మట్టయ్య కిది గుర్తుచ్చింది. "సరే వెళ్లొత్తా" అని నీరసంగా లేచాడు.

ఆ సందూ ఈ సందూ తిరిగి మొత్తానికి ఎలాగో ఆయనిల్లు కనుక్కున్నాడు. ఇంతా చేస్తే ఆయన ఇంట్లో లేడు. ఏదో పని మీద పోయాడంట. సాయంత్రానికి గాని రాడంట.

ఆయనగారి భార్య, మట్టయ్యను గుర్తు పట్టి, "నీవు మా స్థలంలో రోళ్ల కొట్టుతుంటావు కదూ? ఈ దఫా మాంచి సన్నికలొకటి చేసి తీసికు రారా. మా పెద్దమ్మాయికి పంపించాలి!" అని అంది.

మట్టయ్య తన గోడును ఆమెకు చెప్పుకున్నాడు. (సన్నికలు కోసం) పాపం ఆమె అంతా వొపిగ్గా వింది. "మడిలో వున్నా ఆయన వచ్చేక చెప్పుతాలే" అంది. అతడు వచ్చేస్తుంటే "సన్నికలు మాత్రం మర్చిపోకురోయ్!" అని గుర్తుచేసింది.

అక్కడ్నుంచి మట్టయ్య కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు.

నిన్న అమ్ముడుబోని ఆ రోలూ, సన్నికలయినా అమ్ముకొస్తానని వాట్ని నెత్తిమీద పెట్టుకుని మళ్ళీ నీరసంగా బయలుదేరాడు. నిన్న వెళ్ళిన వీధిలో కాక ఇంకో వయిపు వెళ్ళాడు.

రోలు వెంటనే అమ్ముడు పోయింది. ఆ డబ్బుల్తో బియ్యమయినా కొందామని తిర్గి మకాం దగ్గరికి వస్తున్నాడు - సన్నికలు నెత్తిమీద పెట్టుకుని. ఒక పెద్ద డాబా ఇంట్లోంచి ఒకామె పిల్చింది, సన్నికలు కావాలని. ఆమె బాగా చదువుకున్న దాని లాగా వుంది. ఖరీదయని బట్టలు ధరించి పెద్దింటామెలాగ నాజూకుగా వుంది. చిన్నగా కుదమట్టసంగా వున్న ఆ సన్నికలును చూసి ఆమె ముచ్చట పడింది. యిలాటివి వాళ్ళ వూళ్ళో దొరకవు. ఆమె ఏదో పనిమీద ఈ వూరొచ్చింది.

మట్టయ్య దాని ఖరీదు నాల్గు రూపాయలని చెప్పితే బేరమాడకుండా తీసికుంది.

డబ్బులిస్తూ, "ఇలాటివి ఇంకా మూడు కావాలి తీసికొస్తావా?" అంది. యింకో రెండు కొనుక్కొని పోయి వాళ్ళూరిలో వాళ్ళ చుట్టాల కివ్వాలనుకుంది.

మట్టయ్యకు పంచభక్షపరమాన్నాలతో వడ్డించిన విస్తరి ముందు పెట్టినట్లనిపిచింది.

"తీసికొచ్చేటట్లయితే సాయంత్రం లోపలే తీసుకొనిరా. మళ్ళీ మేం ఈరాత్రికే మావూరెళ్ళి పోతున్నాం-" అని అందామె.

ముందు పెట్టిన విస్తరి తినేలోపల లాగేసినట్లని పించింది.

చేసేటందుకు చేతులున్నా, కొనేటందుకు మంచి బేరమునాన అసలు ముందు రాళ్ళేవి? వాడు తనరాళ్ళు తనకిస్తాడా?

వాడు అన్నీ ఇవ్వకపోయినా కనీసం మూడు రాళ్ళు యిచ్చినా బాగున్ను, చెకచెకా చెక్కేసి తీసికెళ్ళి ఆయమ్మకిచ్చి డబ్బులు తీసుకోవచ్చును. వాడ్ని, "అయ్యా బాబని!" బ్రతిమాలితే, ఇట్టా బేరం వచ్చిందని చెప్పితే అన్నీ ఇవ్వకపోయినా రెండురాళ్ళయినా ఇవ్వడా?- ఇలా అనుకుంటూ అతడు చెకచెకా అడుగులేస్తూ వుషారుగా మకాంకు వెళ్ళాడు.

"గీరబాబు" మైక్ పెట్టించి సిన్మాపాటలు వీధికంతా వినిపించేస్తున్నాడు. టపాకాయలు అమ్మకం జోరుగా సాగుతోంది. పండుగ ఇంకా మూడు రోజులేవుంది. "గీరబాబు" కొట్లో నలుగురు కుర్రాళ్ళు నిలబడి వుషారుగా రోడ్డుమీద పొయ్యే జనాన్ని "రండి-రండి" అని పిలుస్తున్నారు, ప్రక్క కొట్లోకి పోనీయకుండా.

మట్టయ్య, కనీసం రెండు రాళ్ళయిన ఇవ్వమని "గీరబాబును" కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడి అడిగాడు.

"గీరబాబు" పెద్ద చీఫ్ ఇంజనీరులాగా ఫోజుపెట్టి,

"రెండు రాళ్ళు తీస్తే ఆ చెక్కలన్నీ ఏమవుతాయి?" అని అడిగేడు - తన కింద పన్జేసే కుర్ర ఇంజనీర్ను చూసినట్లు ఈసడింపుగా చూస్తూ.

"చెక్కలూ, పెట్టెలూ అన్నీ ధబేల్న కిందపడుతాయి!" అని తన ప్రశ్నకు తానే మళ్ళీ సమాధానం చెప్పుకున్నాడు.

మట్టయ్య, "మరి నా అమ్మకం ఎట్టాగా దొరా!" అని దిగులుగా అన్నాడు.

"అమ్మేవులేవోయ్. మాలావు అమ్మకం! పండుగెళ్ళిన తెల్లారి నీ రాళ్ళను నీవట్టుకుపో - నీ రాళ్ళు మాకేం అక్కర్లేదులే!" అని "ఫైనల్"గా చెప్పేశాడు.

మళ్ళీ తన బేరంలో మునిగిపోయాడు.

మట్టయ్య దిగాలుపడిపోయి అక్కడే నిలబడిపోయేడు. ఎంతసేపు అలా నిలబడ్డా "గీరబాబు" మళ్ళీ తల ఎత్తి చూడలేదు.

ఇక లాభంలేదనుకుని భారంగా అడుగులేసుకుంటూ వచ్చి మళ్ళీ దీపం స్తంభం దగ్గర నిలబడ్డాడు. చేతులు రెండూ తల మీద పెట్టుకుని టపాకాయల కొట్టువంక నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయాడు.

...... సూర్యుడు నడికొప్పు మీదకొచ్చాడు. ఎండల్ని చెరిగి కిందవాళ్ళ నడినెత్తిమీద ఎత్తిపోస్తున్నాడు.

అప్పటికి సుక్కాం రెండుసార్లు వచ్చి, "బువ్వకు లెగు మావ!" అని పిల్చింది.

పైన చిరచిరలాడే ఎండనుకానీ, కడుపులో కరకరలాడే ఆకల్నికానీ పట్టించుకునే స్థితిలో లేడు.

అతని ధ్యాసంతో తన రాళ్ళు మీదే వుంది.

పైకి కనిపించకుండా లోపల్లోపల కాలిపోయే వూకవాములా వున్నాడతడు.

అతని మనస్సు గిజగిజ లాడిపోతుంది. పచ్చటి పొలాల్లో మేస్తోన్న మేకపిల్ల దారితప్పి మహారణ్యంలోకి పోయినప్పుడు దాన్ని కబళించటానికి క్రూరమృగాలు నలువైపుల నుండి చుట్టుముట్టితే అదెలా భయంతో తత్తర్లాడిపోతోందో తనూ అలా తత్తర్లాడి పోతున్నాడు.

అతనికి తన పెంపుడు మేక గుర్తుకొచ్చింది. దానికి 'గవరమ్మ' అని ముద్దుపేరు పెట్టుకుని దాన్ని కన్నకూతురులాగా తన ప్రాణంతో సమానంగా చూచుకుంటున్నాడు. రోజూ పొలాల వెంట వెళ్ళి మోపెడు రొట్ట నెత్తిమీద పెట్టుకొచ్చి దాని దగ్గర కూర్చుని ఎంతో ప్రేమగా ఆ రొట్టనంతా తన చేతుల్తో తినిపిస్తాడు. తల్లి వెనకాల వెంటపడే చిన్న కుర్రవాడిలాగా అది, తను పల్లెలో ఎక్కడికెళ్ళితే అక్కడకి వెంటపడి వస్తుంది. ఒక రాత్రిపూట అది వచ్చి తన కాళ్ళదగ్గర పడుకుంటుంది.

తనింత ప్రేమగా చూచుకుంటున్న మేకను, గడువునాటికి డబ్బు కట్టకపోతే షావుకారు అప్పుకింద తోలుకుపోతాడు. దాన్ని "కటికోడికి" అమ్మేస్తాడు. కటిక జగ్గడు దాన్ని కటారి కత్తితో తెగేస్తాడు. దాని మాంసాన్ని అమ్ముకుంటాడు - ఈ తలపురాగానే తనని ప్రాణాలతో వుంచి వేటకత్తితో తన శరీరంలో కండల్ని కోస్తున్నట్లుగా బాధపడ్డాడు.

కటిక జగ్గడు "గవరమ్మ"ను అమ్మమని తననెన్నోసార్లు అడిగేడు. "దాన్ని నా కన్నకూతుర్ని సూసుకుంటున్నట్టు సూసుకుంటున్నా, నా పేనాల్నయినా యిత్తాగాని నా గవిరిని మాత్తం నీ కమ్మను జగ్గయ్యో!" అని అనేవాడు.

దానికి వాడు, "దానికి నా యిల్లే అత్తారిల్లురా! కూతుర్ని అత్తారిల్లుకు పంపకుండా ఎన్నాళ్ళుంచుకుంటావో నానూ సూత్తాగా!" అనేవాడు. వాడు కనిపించినప్పుడల్లా, "మట్టాయి మావా!

నీ కూతుర్ని అత్తారింటికెప్పుడు పంపుతావు" అనేసి మేలమాడేవాడు. వాడలా అన్నప్పుడల్లా తన గుండెలు పీచు పీచు మనేవి.

"ఆడి కళ్ళన్నీ దానిమీదే!"

ఇవన్నీ తల్చుకుంటూ, "నా పిచ్చిముండ ఇకా కటిక జగ్గడి పాలపడుతుంది. ఆడి కత్తికి బలి అవుతుంది-" అని లోపల్లోపల కుమిలిపోతున్నాడు.

అతనికింత బాధలోనూ శాస్తుర్లుగారు వీళ్ళకు చెప్పి తనరాళ్ళు తనకిప్పిస్తాడనే ఆశ ఒక మూల మిణుకు మిణుకు మంటుంది.

ఆ ఆశకూడా అడియాశయింది.

ఆ సాయంత్రమే శాస్తుర్లు తన అర్ధాంగిని వెంటపెట్టుకుని సిన్మాకు బయలుదేరాడు. ఆయన సిటీబస్ ఎక్కాలంటే ఈ స్టాప్‌లోనే ఎక్కాలి. సిటీబస్సు వచ్చేలోపల ఆయన కొట్లవాళ్ళని పరామర్శించాడు. "గీరబాబు" గాడు మట్టయ్య సంగతి చెప్పి, "ఆ గబ్బిలాయిగాడు "రాళ్ళూ-రాళ్ళూ" అని వూరికే గొడవ చేస్తున్నాడు సార్! నాకు కిందపెట్టే చెక్క దొరక్క సమయానికి వాట్ని పెట్టుకున్నా. కాస్త వాడికి చెప్పుసార్!" అన్నాడు.

మట్టయ్య శాస్తుర్లు గార్ని గుర్తుపట్టి ఆయనకు తన గోడు చెప్పుకునే లోపలే ఆయనే అతడ్ని పిలిచాడు. మట్టయ్య భక్తిభారంతో కుంచుకుపోయేడు. రెండుచేతులూ కట్టుకుని అతి వినయంగా "దండాలు దొరా!" అన్నాడు.

ఆయన చాల ఠీవిగ దర్పం వుట్టిపడేటట్లు, "ఏరా, వాళ్ళ నీ రాళ్ళ తీసికున్నారని నానా గొడవ చేస్తున్నా వంటగా. పిచ్చి పిచ్చి వేషాలేశావంటే, నా స్థలంలో "ట్రెస్‌పాస్" చేస్తున్నావని కేసుపెట్టి పోలీసులకు పట్టించి బొక్కలో తోసేస్తాను జాగర్త!" అని బెదిరించాడు. గీరబాబు, "చూశావా నా తడాఖా' ' అన్నట్లు మట్టయ్య వంక చూశాడు.

మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో, కాస్త గొంతు తగ్గించి అనునయించే ధోరణిలో- "కాదురా రాళ్ళకే అట్టా యాగీ చేస్తావేంరా నీదుంపతెగా! వాళ్ళ ఈ రెండు రోజులుండి వాళ్ళదార్ని వాళ్ళ పోతారు. అప్పుడు నీ యిష్టమొచ్చిన రోజులుండి హాయిగా నీ పని చూస్కో!" అన్నాడు.

"నా బేరం దొరా-"

"నీ బేరం ఎక్కడికి పోతుందిరా? పండక్కి యింటికిపోయి మళ్ళీరా!" అన్నాడు.

ఇంతలో నదరుగా సింగారించుకున్న తన "ముదురు" పెళ్ళాం వంక రోడ్డుమీద పొయ్యే పోకిరీ కుర్రాళ్ళు చూస్తూ పోవటం ఆయన కంటపడింది. ఆయనకు వళ్ళు మండిపోయింది. ఆ మంట మట్టయ్య మీద చూపించాడు.

"మళ్ళీ ఈ లోపల రాళ్ళనే గొడవచేస్తే అసలు నిన్నీ ఈ స్థలంలో జేరనివ్వను. కేసుపెట్టి జైలులో పెట్టిస్తా!" అన్నాడు సీరియస్‌గా, మొగం కండలన్నీ పీక్కుంటూ.

మట్టయ్య ఏదో చెప్పబోయాడు. ఇంతలో సిటీబస్సు వచ్చింది. శాస్తుర్లు, కంగారుగా పరిగెత్తాడు.

ఆయన భార్య వెళ్లుతూ, "అరే, సన్నికలు సంగతి మర్చిపోవద్దు సుమీ!" అని దీర్ఘం తీసి తిప్పుకుంటూ వెళ్ళింది.

* * *

అయితే, సీకటితో పట్టుబస్సుకి ఊరెల్లి పోతారా?' అని నర్సింగులు ఆ రాత్రి అడిగేడు.

"అవును దొరా! యీడుండి యేం సేత్తాం?" అన్నాడు మట్టయ్య నీరసంగా.

అతడు ఆ పగలంతా తిండి తినలేదు. రాత్రి ఒక ముద్ద తిని సహింపుకాక చెయ్యి కడుక్కున్నాడు.

"గవిరి" మెళ్లో అతడు ముచ్చటపడి కట్టిచ చిన్న గంట చిరుమోతలు ఆ రాత్రంతా అతని చెవుల్లో, గుండెల్లో వినిపించాయి.

సుక్కాంకు రాత్రంతా తన కొడుకు కళ్ళల్లో మెదిలాడు. నిన్న తానుకూడా వస్తానని వెంటపడి ఏడ్చి గొడవ గొడవ చేశాడు. "బత్తీనుండి నీకు టపాకాయలు కొనుకొత్తారా! అని సముదాయించి వచ్చింది.

"పిల్లగాడికి టపాకాయలు కొనుక్కొని పోదాం మావా! అని యిందాక అంటే- "బస్సు సేర్జీలకు బొటాబొటీగా వున్నాయి - టపాకాయలా, గిపాకాయలా-" అని విసుక్కున్నాడు మట్టయ్య.

"పిల్లగాడికి జొరం యెలా వుందో! టపాకాయలు తేలేదంటే ఎంత ఇదయిపోతాడో బిడ్డడు-" అని మాటిమాటికి అనుకుంది.

చీకటితో లేచి ఫస్టుబస్సులో వాళ్ళీరు వెళ్ళిపోయారు గంపెడు చీకటి నెత్తి మీదేసుకుని.

బస్సుదిగి గంతాబొంతా నెత్తిమీద పెట్టుకుని వస్తుంటే వీళ్ళను చూచి, గుడిసె ముంగిట పడుకుని రొట్టమేస్తున్న మేక, "మేమే" అంటే పరుగెత్తుకుంటూ వచ్చి మట్టయ్య కాళ్ళకు అడ్డాలు పడింది. మేక అరుపువిని ప్రక్కనే కుక్కి మంచంలో నీరసంగా పడుకున్న పిల్లవాడు తల ఎత్తి చూశాడు. తల్లీ తండ్రులను చూచి, "టపాకాయలు-టపాకాయలు" అంటూ సంతోషంగా చప్పట్లు కొట్టేడు.

టపాకాయలు తీసికురాలేదని సుక్కాం చెప్పింది. ఏడుపు లంకించుకున్నాడు.

మట్టయ్య నెత్తిమీద మూటను కందపడేసి, తన "గవిరి"ని రెండు చేతులతో పొదివిపట్టుకుని దగ్గరకు తీసుకుని గుండెల కదుముకున్నాడు. అప్యాయంగా దాని వీపు మీద చేత్తో రాస్తుంటే అతనికి ఆవుకోలేనంత దు:ఖం వచ్చింది. "నిన్నా కటికోడి సేతుల్లో పెట్టాల్సిందేనే గవిరి! తప్పదు - నేనుత్త సేతగాని ఎదవనయిపోయానే! నిన్ను దక్కించుకోలేనే! నేనుత్త సవటెధవని - వెధవన్నరెధవను-"

అతని కళ్ళనిండా నీరు వుబికేయి.

- ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

*19 జనవరి 1973*

★